# ఈవి

పెద్దాసుపత్రిలో వాళ్ళాయన తరుపు మనిషిని చూడడానికి మా స్వస్థలం నుండి చిట్టి ఈ ఊరు వచ్చి ఉండకపోతే నాకు ఏ సమస్యా ఎదురయి ఉండేదికాదు.

చిట్టి నా చిన్నమ్మ కూతురు. నాకన్నా అయిదారు సంవత్సరాలు చిన్నది. వాళ్ళిల్లు మా ఇంటి పక్కనే ఉండేది. చిట్టి చిన్నప్పటినుండి గడుగ్గాయే. మేం వాళ్ళింట్లోనో, వాళ్లు మా ఇంట్లోనో ఉండేవాళ్లం. అప్పట్లో అందరం పదిమందిమి ఉంటే అన్ని విషయాల్లో చిట్టిదే పయి చేయిగా ఉండేది. పెద్దాచిన్నా లేకుండా అందరినీ ముప్పతిప్పలు పెడుతుండేది. ఎందువలనో నా జోలికి మటుకు వచ్చేదికాదు.

ఈసారి నన్ను వదలలేదు.

ఏడెనిమిది సంవత్సరాల తర్వాత కలవడం వలన ఆ రాత్రి భోజనాలయ్యాక తీరికగా కూర్చుని చిన్నప్పటి సంగతులు చెప్పుకోవడం మొదలెట్టాం. మాతోపాటు నా రెండోకూతురు ప్రియ కూర్చుంది. ప్రియ డిగ్రీ చివరి సంవత్సరంలో ఉంది. నాకు ఇద్దరే సంతానం. పెద్దమ్మాయికి పెళ్ళి అయి భర్తతో బెంగుళూరులో ఉంటోంది. నా భార్య చనిపోయి పన్నెండు సంవత్సరాలు గడిచాయి.

చిట్టి చిన్ననాటి సంగతులు ఒకొక్కటి గుర్తు చేస్తోంటే వెనక్కి వెళ్ళిపోతున్నట్టు అనిపించసాగింది. చిట్టి మాటల్లో ఎటువంటిమార్పు రాలేదు. ఏమీ లేని విషయాన్ని కూడా చక్కగా చెప్పగలుగుతుంది. ముందు తన కుటుంబవిషయాలు ఒక గంటపాటు మాకు కథలా వినిపించింది. తర్వాత ప్రస్తావన నామీదకు జరుగుతుందని నేను అనుకోలేదు.

"వదిన చనిపోయి పదేళ్ళు కాలేదూ?" అడిగింది చిట్టి.

"వదిన మనందరికి లింకులా ఉండేది. అందరినీ కలుపుకుని నడిచింది. నీకంత కలుపుగోలుతనం లేదు. ఆమె చనిపోయాక నువ్వూ నీ పిల్లలు మన ఊరు ఎన్నిసార్లు వచ్చారేమిటి?"

"రావాలనే అనుకుంటాం. ప్రియ చదువు పూర్తి అయితేనే గాని తీరిక చిక్కదు".

"నీకు సర్వీసు ఇంకెంత ఉందేం?"

"అయిదేళ్లు."

"మీ తమ్ముళ్లంత చదువుకోకపోయినా నువ్వే నయం అనిపిస్తోంది. మీ వాళ్లు ఎప్పుడయినా వస్తుంటారా?"

తెలిసి అడుగుతుందో, తెలియక అడుగుతోందో నాకు అర్థం కాలేదు. తల అడ్డంగా ఆడించి, "రారు" అన్నాను.

"పోట్లాడుకున్నారా?"

"లేదు".

"నువ్వు వెళ్తే వాళ్ళొస్తారు. నువ్వు వెళ్లవు" అని ప్రియ వయిపు తిరిగి, "పాపా, మీ నాన్న దురదృష్టం ఏమిటోగాని చిన్నప్పటినుండి మీ నాన్నను అడ్డం పెట్టుకొని మీ చిన్నాయనలు బాగుపడ్డారు. సంతకాలు చేయించుకొని రావలసిన ఆస్తి రానీయకుండా చేశారు. వాళ్లను తప్పుపట్టి ఏం లాభం? మీ అమ్మనెత్తీనోరూ కొట్టుకున్నా వినిపించుకున్నాడా...?" అంది.

చిట్టి మాటలకు అడ్డు తగలబోయాను. వీలు చిక్కనీయలేదు. "నువ్వాగు, అయిదు నిమిషాల పాటు, నీకూతురుతో నన్ను మాట్లాడనీయి. ఈ సంగతులు నీ కూతుళ్లకు తెలిసి ఉంటాయని అనుకోను... వాళ్ళకూ తెలియాలి.. మీ నాన్న ఇంటర్ రెండో సంవత్సరం లోకి వచ్చేవరకు కాళ్ళకు చెప్పులుండేవి కావు. డిగ్రీమొదటి సంవత్సరంలోకి వచ్చేకగాని పంట్లాంలు వేయడం మొదలుపెట్టలేదు. మీ తాత దగ్గర డబ్బులు లేక కాదు. మీ నాన్నకు ఖర్చు పెట్టడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదు, అంతే. మిగతా వాళ్ళకు బాగానే ఖర్చుచేసేవాడు. వాళ్లకు అన్నీ ఉండేవి. మీ నాన్నే పిచ్చిమేళం. ప్రతి విషయంలోనూ సర్దుకుపోతుండేవాడు.

"మీ తాతగాని, మీ నాయనమ్మగాని మీ నాన్నను ఆయన తమ్ముళ్ళతో సమానంగా చూడలేదు. పరాయి వ్యక్తిగానే చూసేవాళ్ళు. అంతెందుకు, మీ నాన్న

పెళ్ళి కూడా తూతూ మంత్రంగా జరిపించారు. ఇంట్లో ఏ శుభకార్యంజరిగినా మీ నాయనమ్మ ఘనంగా చేసేది. పిల్లల కోసం పిండి వంటలు చాలా చేయించేది. మీ నాన్నదగ్గరకు వచ్చేసరికి ఒట్టి చేయి చూపించేది. పచ్చళ్ళు కూడా ఇచ్చేది కాదు. ఒక్కసారి అనుకుంటే ఒక్కసారి కాదు, మీ నాన్న ఈ విషయాలు ఎప్పుడూ సీరియస్‌గా తీసుకుని ఉండడు. మీ అమ్మ ఏమనుకునేదో ఏమో, బాధపడినట్లు మాకు ఎప్పుడూ అనిపించలేదు. మా ఇంటిల్లపాదీ అనుకునేవాళ్ళం. బాధవేసేది.

"తల్లిదండ్రుల ప్రేమ పిల్లలందరి మీద సమానంగా ఉంటుందని ఒకప్పుడు అనుకునేదాన్ని. చాలామంది ఒప్పుకోరు గాని వ్యత్యాసాలు చాలా కుటుంబాలలో గమనించాను.." ఆగింది.

చిట్టి చెప్పిన విషయాల్లో అబద్ధం ఏమీ లేదు. అవన్నీజరిగి చాలా సంవత్సరాలు గడిచాయి. అమ్మా నాన్నా చనిపోయి అయిదు సంవత్సరాలు దాటాయి. నేను దేనికోసం తాపత్రయ పడలేదు. నాకేదో అన్యాయం జరిగిందని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఎప్పటి సంగతులో చిట్టి, ప్రియకు చెప్పకుండా ఉండాల్సింది, ఆ తర్వాత మా సంభాషణ వేరే విషయాల మీదకు వెళ్ళింది.

మా కబుర్లు ముగిసేసరికి పదకొండు దాటింది. పడుకోడానికి చిట్టి పక్కగదిలోకి వెళ్ళిపోయింది. నేను మధ్యగదిలో పడుకుంటాను. నిద్రకుపక్రమిద్దామని లయిటు ఆర్పేయబోతూ ఆగాను. ప్రియ సోఫాలోనే కూర్చుని ఉంది. చిట్టి చెప్పిన విషయాల గురించి ఆలోచిస్తోందేమో, ముఖం గంభీరంగా ఉంది.

"నిద్ర రావడం లేదమ్మా?" అడిగాను.

"లేదు నాన్నా" అంది.

"నాకు మంచినీళ్లు తెచ్చి పెడతావా?"

సోఫా దిగి వంటగదిలోకి వెళ్ళబోతూ ఆగి, "చిట్టి ఆంటీ చెప్పిన విషయాలు నిజమేనా నాన్నా?" అడిగింది.

నవ్వాను. అవుననలేదు. కాదనలేదు.

వంటగదిలోకి వెళ్ళి గ్లాసునిండా, మంచినీళ్లు తీసుకు వచ్చి నాకు అందిస్తూ, "నిజమే కదూ నాన్నా?" అడిగింది. ప్రియబాధ పడుతున్నట్లు నాకు అనిపించింది.

తలూపి మంచం మీద కూర్చున్నాను. ప్రియ అక్కడే నుంచుంది.

"వెళ్తూ లయిటార్పేసి వెళ్ళమ్మా."

"మీరంటే నాయనమ్మకు ఏమాత్రం ఇష్టం లేనప్పుడు ఆమె పేరు నాకు ఎందుకు పెట్టారు?"

మా అమ్మపేరు ప్రియంవద. నా కూతురు పేరు కూడా అదే.

"మా అమ్మ అంటే నాకు ఇష్టమమ్మా. నువ్వు పుట్టిన తర్వాత ఉద్యోగపరంగా నాకెంతో కలిసి వచ్చింది. నేను పోగొట్టుకుంది తిరిగి పొందినట్టు అనిపించి నీకు ఆ పేరు పెట్టాను."

నా జవాబు ప్రియకు నచ్చిందో, లేదో కాని తన గదిలోకి వెళ్ళిపోయిన చాలా సేపటి వరకు లయిటు వెలుగుతూనే ఉంది.

❖ ఆదివారం వార్త, 5 ఏప్రిల్,2009